


వృద్ధుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి


వృద్ధులతో డిఎస్‌పి శ్రీవేద

నరసాపురం : వృద్ధుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం 2025 పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం నరసాపురం పట్టణంలోని బొండమ్మ వృద్ధాశ్రమాన్ని డిఎస్‌పి శ్రీవేద పరిశీలించారు. ముందుగా వారి వివరాలు, కుటుంబ, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు పండ్లు, చీరలు ఆమె పంపిణీ చేశారు. సీనియర్ సిటీజన్స్ యాక్ట్‌పై వృద్ధులకు అవగాహన కల్పించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేస్తే సమస్యలను పరిష్కరిస్తానని డిఎస్‌పి శ్రీవేద తెలిపారు. డిఎస్‌పి వెంట నరసాపురం పట్టణ సిఐ బి.యాదగిరి ఉన్నారు.

నేడు పట్టభద్రుల తీర్పు

ఉదయం 8 గంటలకు ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్
బరిలో 35 మంది అభ్యర్థులు, మొత్తం పోలైన ఓట్లు 2,18,902
మొదటి ప్రాధాన్యతా ఓటులో 50 శాతం మార్క్‌దాటితే విజేతనే
మార్క్ దాటకపోతే ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్లాల్సిందే
ఫలితం వెల్లడికి సమయం పట్టే అవకాశం
టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. పట్టభద్రుల ఓటర్లు తీర్పు ఎటువైపు అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. నెల రోజులకుపైగా జరిగిన ఎన్నికల తంతు సోమవారంతో తెరపడనుంది. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో విజేత ఎవరో తేలిపోనుంది. జనవరి 29న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి మూడో తేదీన ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ వెట్రిసెల్వి నోటిఫికేష్ జారీచేశారు. ఆ రోజు నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. 13వ తేదీన విత్‌డ్రాల పర్వం ముగిసేరికి ఎన్నికలో 35 మంది అభ్యర్థులు నిలిచారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 3,14,984 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఫిబ్రవరి 27వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరిగింది. ఓటింగ్‌లో మొత్తం 2,18,902 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుండడంతో తుది తీర్పు కోసం అభ్యర్థులంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఉదయం ఎమినిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ముందుగా బ్యాలెట్ బాక్సులో ఓట్లను కట్టలుగా కడతారు. తర్వాత చెల్లని ఓట్లను తొలగిస్తారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రాధాన్యత అంకెల క్రమంలో ఓటింగ్ జరగడంతో లెక్కింపునకు సమయం ఎక్కువ పట్టనుంది. చెల్లుబాటు అయిన ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓటుతో 50 శాతం మార్క్ దాటిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఒక వేళ ఏ అభ్యర్థికీ మొదటి ప్రాధాన్యత ఓటులో 50 శాతం మార్క్ దాటకపోతే ఎలిమినేషన్ రౌండ్ అనివార్యంగా మారుతోంది. రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియ సాగుతోంది. సోమవారం సాయంత్రానికి కట్టలు కట్టడం పూర్తవుతుందని, మంగళవారం ఉదయానికి ఫలితంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపులో మూడు షిఫ్టులుగా పని చేసేందుకు 700 మంది సిబ్బందిని నియమించారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన పరిస్థితి నెలకొంది.

టిడిపి, పిడిఎఫ్ నాయకుల్లో ఉత్కంఠ

ఫిబ్రవరి 27న జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల బరిలో ఇరువురు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డారు. కూటమి పార్టీల నేతల నుంచి సిఎం, డిప్యూటీ సిఎం వరకూ అంతా టిడిపి అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, పలు ప్రజాసంఘాలు పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు తరపున ప్రచారం నిర్వహించారు. పోలింగ్ రోజు అధికార పార్టీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. పలుచోట్ల అధికార పార్టీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద డబ్బులు పంపిణీ చేయడం, దొంగ ఓట్లు వేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలికారన్న విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గెలుపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పట్టభద్రులు ఎవరివైపు నిలబడ్డారో కొద్ది గంటల్లో తేలిపోనుంది. ఏదిఏమైనా ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ వ్యవహరించిన తీరు మాత్రం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం : ఉదయం 8గంటలకు
బరిలో ఉన్న అభ్యర్థులు : 35 మంది
మొత్తం ఓటర్లు : 3,14,984 మంది
పోలైన ఓట్లు : 2,18,902
కౌంటింగ్ టేబుల్స్ : 28
రౌండ్లు : 17
కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బంది : 700 మంది


ఆందోళన చేస్తున్న రైతులు

సాగునీటి సమస్యను పరిష్కరించాలి

కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన రైతుల ఆందోళన

ప్రజాశక్తి - అత్తిలి


సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఈడూరు రైతులు కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన పంట చేలోకి దిగి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ మాట్లాడుతూ మండలంలోని ఈడూరు గ్రామ పంచాయతీ పరిధిలో దాళ్వాకు సాగునీరందక వరి పొలాలు బీటలు వారాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వం సాగునీరందించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతులందరితో కలిసి గ్రామ నడిబొడ్డున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. రైతులు మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా సార్వా పంట పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. ఎకరానికి వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. సార్వా మూడో దఫా పంట ఊడ్చలేక మొత్తం 400 ఎకరాలు గ్రామ పంచాయతీ పరిధిలో వదిలేశామని తెలిపారు. నష్టానికి ఎటువంటి పరిహారమూ అందలేదని తెలిపారు. దాళ్వాలో ఎకరానికి 35 వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని, తీరా పంట ఈనిక దశకు వచ్చేసరికి సాగునీరందక వరి పొలాలు బీటలు వారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి, కౌలు వ్యవసాయం చేస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సంకు లక్ష్మణరావు, బొక్కా యాకోబు, వనపల్లి సుబ్బారావు, ముదిండి పెద్దిరాజు, భీమ్ సింగ్ వెంకట్రావు, తలారి విష్ణుమూర్తి, డి.జయరాజు, పి.సత్తిపండు, పోతిరెడ్డి దానయ్య, బి.శేషయ్య సంకు కొండ పాల్గొన్నారు.

జాతీయస్థాయి బధిర టీ20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపిక

జిల్లా బధిర క్రికెట్ అసోసియేషన్ అభినందనలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

7వ జాతీయ స్థాయి బధిర (మూగ, చెముడు) టీ20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపికయ్యారని జిల్లా బధిర క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రంగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.తాతారావు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన 16 మంది బధిర క్రీడాకారులు ఏప్రిల్ 19 నుంచి 25వ తేదీ వరకూ హర్యానా, కాచపూర్, గురుగామ్‌లో జరగనున్న బధిర క్రికెట్ టీ20 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం భీమవరం వెంకట్రామ థియేటర్‌లో జరిగిన సమావేశంలో వివరాలను తెలిపి ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. ఇటీవల భీమవరం డిఎన్ఆర్ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి టీ20 క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుల్లో 16 మంది జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయిలో కూడా రాణించాలని కోరుకుంటున్నామన్నారు. ఆర్గనైజింగ్ వైస్ ఛైర్మన్ టి.రాము, కోశాధికారి జి.రామచంద్రరావు, బిహెచ్.రవికుమార్‌రాజు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు అందరి సహకారం కావాలని కోరారు.


నూతనంగా ఎన్నికైన సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు

ట్రెజరీస్, అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - భీమవరం

ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సంఘం ఎన్నికలు స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జె.రామారావు (సబ్ ట్రెజరీ ఆఫీసర్, జిల్లా ఖజానా కార్యాలయం, భీమవరం), జిల్లా కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ, సహాధ్యక్షులుగా ఎంకె.హనుమంతరావు (సీనియర్ అకౌంటెంట్, ఉప ఖజానా కార్యాలయం, పాలకొల్లు), ఉపాధ్యక్షులుగా విఎస్ఎస్.శ్రీనివాస్ (ఉప ఖజానాధికారి, ఉప ఖజానా కార్యాలయం, పాలకొల్లు), ఎన్.సీతారామయ్య (సీనియర్ అకౌంటెంట్, ఉప ఖజానా కార్యాలయం, తాడేపల్లిగూడెం), డి.పుష్పలత (ఉప ఖజానాధికారి, ఉప ఖజానా కార్యాలయం, ఆకివీడు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.నరేంద్రరాజు (సీనియర్ అకౌంటెంట్, ఉప ఖజానా కార్యాలయం, నర్సాపురం), జాయింట్ సెక్రటరీలుగా డి.నాగభూషణం, (సీనియర్ అకౌంటెంట్, ఉప ఖజానా కార్యాలయం, తాడేపల్లిగూడెం), జె.తిరుపతి రెడ్డి (సీనియర్ అకౌంటెంట్, డివిజనల్ సబ్ ట్రెజరీ, నర్సాపురం), వి.శారద దేవి (సీనియర్ అకౌంటెంట్, ఉప ఖజానా కార్యాలయం, తణుకు) ట్రెజరర్‌గా పి.కొండలరావు (జూనియర్ అకౌంటెంట్, జిల్లా ఖజానా కార్యాలయం, భీమవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి షేక్ అబ్దుల్ ఖాదర్, ఎపి టాసా రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. సంఘ సభ్యుల పురోభివృద్ధికి పాటుపడుతూ త్వరలోనే అన్ని జిల్లాల ఎన్నికలు పూర్తిచేసుకుని రాష్ట్ర సంఘం ఎన్నికలకు వెళతామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి ఎపి టాసా రాష్ట్ర అధ్యక్షులు జి.రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్ ట్రెజరీ, అకౌంట్స్ అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

పట్టించుకోని అధికారులు


ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి భయపెడుతున్నాయి. ఎప్పుడు పడిపోతాయో తెలీని పరిస్థితిలో నెలకొన్నాయి. ఎప్పుడు ఎవరి మీదకు ఏ వైర్ పడుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ఈ వైర్లు తెగిపడడంతో మంటలు వస్తున్నాయి. ప్రజలు, అక్కడి స్థానికులు భయపడుతూ విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేస్తే అప్పుడు వచ్చి ఆ వైర్లు తిరిగి స్తంభానికి కడుతున్నారు. అంతే తప్ప మిగిలిన చోట్ల వైర్ల పరిస్థితిని గమనించకపోవడం బాధాకరం. మండలంలోని చెరుకుమిల్లి నుంచి ఏలూరుపాడు వెళ్లే రోడ్లో చెరుకుమిల్లి శివారు ప్రాంతంలో వెంకయ్య కాలువ వారన ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. భారీ స్థాయి హై టెన్షన్ వైర్లతో ఉన్న ఈ స్తంభం పడిపోతే భయంకరమైన పరిస్థితి ఏర్పడతాయి. ఈ స్తంభాన్ని ఆపేందుకు గాను మరో రెండు స్తంభాలు ప్రధాన స్తంభానికి ఉత్తర, దక్షిణ దిక్కులు బోట్లు పెట్టారు. అయితే ఇక్కడ చెప్పవలసిన విషయం అసలు స్తంభం కన్నా ఈ స్తంభాలు రెట్టింపు ఒరిగిపోయాయి. ఇప్పుడు పడటం అంటూ జరిగితే మూడు స్తంభాలు కలిసి పడతాయి. దీనివల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. వెంటనే అధికారులు ఈ పరిస్థితిని సరిచేయాలని ఇక్కడ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ఆకివీడు: చెరుకుమిల్లి వద్ద ఒరిగిపోయి భయపెడుతున్న విద్యుత్ స్తంభం

దళిత పేటలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

పెనుమంట్ర : మండలంలోని పొలమూరు గ్రామ పరిధిలోని దళిత పేట ఆరవ వార్డులో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చాలా రోజులుగా ఈ విద్యుత్ స్తంభం పై భాగం విరిగిపోయి, విద్యుత్ కనెక్షన్ తీగలు వేలాడుతున్నాయని పెనుమంట్ర విద్యుత్ ఎఇకి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ స్థంభం తొలగించి, దాని స్థానంలో కొత్తది వేయమని కాంట్రాక్టర్‌కు ఆయన చెప్పి నెలలు గడుస్తున్నా పనులు జరగకపోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుతుందోనని బిక్కు బిక్కు మంటున్నామని వారు వాపోయారు.


పెనుమంట్ర : పై భాగం విరిగిపోయిన విద్యుత్ స్తంభం


సముద్ర స్నానం చేస్తున్న జనం

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత అప్రమత్తతతో నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విధులు కేటాయించిన ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్ సూపర్ వైజర్లు, రోల్ ఇన్‌ఛార్జిలు, పర్యవేక్షణ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల బ్యాలెట్ పేపర్ లెక్కింపులో పూర్తి ఏకాగ్రతతో కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో, బండ్లింగ్ చేయడం, లెక్కించే ప్రక్రియల నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్యతా ఓటు, నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి 456 పోలింగ్ బూత్‌ల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సుల్లో ఉన్న ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి టేబుల్‌కూ కౌంటింగ్ సిబ్బందితో పాటు టేబుల్ సూపర్‌వైజర్, రోల్ ఇన్‌ఛార్జి, షిఫ్టు ఇన్‌ఛార్జులతోపాటు మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే శిక్షణాతరగతులు నిర్వహించుకున్నామని, దానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఏలూరు సర్ సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపు విధులకు షిఫ్టుల వారీ 700 మంది సిబ్బందిని నియమించామని సోమవారం ఉదయం షిఫ్టుకు కేటాయించిన సిబ్బంది ఉదయం 6.30 గంటల కచ్చితంగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ


పాలకొల్లులో మంచు దుప్పటి

ప్రజాశక్తి - పాలకొల్లు

తెల్లవారుజామున మంచు ప్రభావంతో పాలకొల్లు ప్రాంతంలో మంచు దుప్పటి కప్పుకుంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఆదివారం శెలవు దినం కావడంతో పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మంచు దుప్పటితో ఇబ్బంది పడ్డారు. అయితే మంచు ప్రవాహం ఉండగానే సూరీడు నేనున్నాను అంటూ మంచు తెరలు చీల్చుకుని ప్రకాశిస్తూ వచ్చాడు. దీంతో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

నరసాపురం : ఆదివారం ఉదయం తెల్లవారుజామున విపరీతంగా మంచు కురిసింది. దీంతో జాతీయ రహదారి 216పై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తమ ప్రయాణాలను ఆలస్యంగా కొనసాగించారు. ఉదయం ఎనిమిది గంటల తర్వాత మంచు ప్రభావం కాస్త తగ్గుముఖం పట్టింది. మార్చి నెలలోనూ మంచు కురవడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.



నరసాపురం : కురుస్తున్న మంచు

ట్రెజరీస్, అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నిక

ఏలూరు సిటీ: ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సంఘ ఎన్నికలు స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా దాసరి కృష్ణంరాజు (అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్, డిసిహెచ్ఎస్, ఏలూరు), జిల్లా కార్యదర్శిగా ఇ.మహేష్‌బాబు, (సీనియర్ అకౌంటెంట్, జిల్లా ట్రెజరీ ఏలూరు), సహాధ్యక్షులుగా పి.మాధవి (ఎకౌంట్స్ ఆఫీసర్, డ్వామా, ఏలూరు) ఉపాధ్యక్షులుగా పి.ప్రేమావతి (సహాయ ఖజానాధికారి, ఏలూరు), ఎన్.శ్రీనివాసరావు (ఉప ఖజానాధికారి, భీమడోలు) ఎస్.జయలక్ష్మి,(సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.శిరీష్ కుమార్ (సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు) జాయింట్ సెక్రటరీలుగా ఎస్.చినబాబు (ఉపఖ జానాధికారి, డివిజనల్ సబ్ ట్రెజరీ జంగారెడ్డిగూడెం). ఎస్.సాయికృష్ణ (జూనియర్ అకౌంటెంట్ ఉపఖజానా కార్యాలయం కైకలూరు) కె.రత్నకుమారి (సీనియర్ అకౌంటెంట్ డివిజనల్ సబ్ ట్రెజరీ ఏలూరు) ట్రెజరర్‌గా కె.నరేంద్రబాబు (సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు) వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, ఎపి టాసా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం తెలిపారు. సంఘం సభ్యుల పురోభివృద్ధికి పాటుపడుతూ త్వరలోనే అన్ని జిల్లాల ఎన్నికలు పూర్తిచేసుకుని రాష్ట్ర సంఘ ఎన్నికలకు వెళ్లామని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి హసీనా బేగం తెలిపారు. జిల్లాలో సంఘ సభ్యుల అభ్యున్నతికి, వారి ఉద్యోగోన్నతులకు, వారి శ్రేయస్సుకు పాటుపడతామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు డి.కృష్ణంరాజు, కార్యదర్శి ఇ.మహేష్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి ఎపి టాసా రాష్ట్ర అధ్యక్షులు జి.రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్, జిల్లాలోని యావన్మంది ట్రెజరీ, అకౌంట్స్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్నికైన ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్


నూతనంగా ఎన్నికైన వైసిపి నాయకులు

వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

సీనియర్ నాయకులు సుంకర సీతారామ్


ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్ తెలిపారు. ఆచంట నియోజకవర్గస్థాయి పార్టీ పదవులు కేటాయింపులో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు ఆచంట మండలానికి చెందిన ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పిల్లి రుద్రప్రసాద్, బిసి సెల్ అధ్యక్షులుగా మెట్లేటి రామకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ ఖాసిం, వీవర్స్ సెల్ అధ్యక్షులుగా వీరభద్రం, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా సంబూరి రాజా, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులుగా కుక్కల కిరణ్‌కుమార్, వికలాంగుల విభాగం అధ్యక్షులుగా చదలవాడ ముత్యాలరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు వీరికి శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం సుంకర సీతారామ్ మాట్లాడుతూ పార్టీ పదవుల ఎంపికలో ఆచంట మండలానికి సముచిత స్థానం కల్పించారని తెలిపారు. పదవులు పొందిన నాయకులు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు అన్ని విధాలా పార్టీ అండగా ఉండే విధంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట టౌన్ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, వైసిపి సీనియర్ నేత కోట వెంకటేశ్వరరావు, కోళ్ల రాజారావు, కేతా తాతారావు, పెచ్చెట్టి రామారావు, కాండ్రేగుల కనకేశ్వరరావు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్, ట్రస్టీ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.


కమిటీ సభ్యులతో ఎంఎల్ఎ పితాని

జాతరలతో ఐక్యత పెంపొందుతుంది

మాజీ మంత్రి, ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామాల్లో వెలసిన అమ్మవార్ల జాతరల ద్వారా అన్ని తరగతుల ప్రజల్లో ఐక్యత పెంపొందుతుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని మార్టేరు గ్రామ దేవత శ్రీపోలేరమ్మ తల్లి జాతర రెండో రోజు పూజల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో మేళతాళాలు, బాణా సంచా కాల్పులతో ఘనంగా ఊరేగించారు. స్థానిక కమిటీ సభ్యులు దగ్గరుండి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఎంఎల్ఎ పితానిని కమిటీ సభ్యులు సన్మానించారు. అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు మొక్కుబడులు చెల్లించుకొని దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూసుకున్నారు. ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ తెలిపింది. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఎస్ఐ స్వామి, సిబ్బంది చూసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి పెద్ద వీధిలో తీర్థం జరిగింది. సోమవారం అమ్మవారిని పుట్టింటి నుంచి అత్తింటికి పంపుతారని కమిటీ తెలిపింది.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బిచర్లలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో బాలుర నుంచి ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ నల్లి సాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్లో ఎంపిసి విభాగంలో 40, బైపిసిలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మార్చి 6వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి ఫోటో కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ 99084 54667, వైస్ ప్రిన్సిపల్ 9490889741 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రాజేశ్వరికి పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం గునుపూడి రథోత్సవంలో కరెంట్ స్తంభం పడి గాయపడిన బాధితురాలిని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం పరామర్శించారు. భీమవరం హాస్పటల్లో చికిత్స పొందుతున్న బండి రాజేశ్వరిని ఎంఎల్ఎ అంజిబాబు పరామర్శించారు. చికిత్స విషయాలను, ప్రమాద ఘటన విషయాలను వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు.

మాజీ మంత్రి జోగయ్యకు పరామర్శ

పాలకొల్లు : కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హర రామ జోగయ్యను మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. ఆదివారం పాలకొల్లు వచ్చిన మంత్రి జోగయ్య ఆరోగ్య పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటం, 20 రోజులు ఆస్పత్రిలో ఉన్న నేపథ్యంలో ఆయన స్వగృహం వద్ద పరామర్శించారు. ఆయనకు ఎటువంటి వైద్య సహాయం కావాలన్నా అందుబాటులో ఉంచుతామని మంత్రి సలహా ఇచ్చారు. ఇంకా ఆయనతోపాటు పలువురు జనసేన నేతలు బన్నీ వాసు, బోనం చినబాబు, శిడగం సురేంద్ర పాల్గొన్నారు.

పాలకొల్లులో 5 కేజీల మారేడు కాయ

పాలకొల్లు : పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి మరదలు బంగారు శిరీష గృహంలో 5 కేజీల మారేడు కాయ కాసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. వారి ఇంట్లో మారేడు కాయ చెట్టు 45 అడుగుల వరకు ఎదిగింది. అయితే కేబుల్‌కు వైర్లు అడ్డం రావడంతో ఆదివారం కొమ్మలు కొడుతుండగా 5 కేజీల మారేడు కాయ ప్రత్యక్షమైంది. పరమశివుడికి ప్రీతికరమైన అంత పెద్ద మారేడు కాయ తమ గృహంలో కాయడం ఆనందంగా ఉందని ఆమె చెప్పారు. ఇరుగు, పొరుగు వారు పెద్ద ఎత్తున తరలివచ్చి కాయను చూస్తున్నారు.

జనసేనలోకి పలువురు

పాలకొల్లు : మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో పాలకొల్లు మారుతి సెంటర్‌కు చెందిన కొందరు నేతలు ఆదివారం జనసేనలో చేరారు. మంత్రి పిఠాపురం నుంచి భీమవరం వెళ్తూ పాలకొల్లులోని సినీ నిర్మాత బన్నీ వాసు అతిథి గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మారుతి టాకీస్ సెంటర్‌కు చెందిన మండెల రజినీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు నేతలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బన్నీ వాసుతో పాటు జనసేన నేతలు, పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర, బోణం చినబాబు, తుల రామలింగేశ్వర రావు, యలమంచిలి మండలం అధ్యక్షులు వరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 12న పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాటుల గురించి నేతలతో మాట్లాడినట్లు సమాచారం.

సేంద్రియ పంట.. ఆరోగ్య వంట


లక్ష్మీపతిరాజు పండిస్తున్న బచ్చల పంట

ప్రజాశక్తి - కాళ్ల

ఎరువులు వేయకుండా పంటలు పండించడం మాత్రం అసాధ్యమనే చెప్పాలి. పూర్వం పశువులు, కోళ్ల నుంచి లభించిన ఎరువును వ్యవసాయ క్షేత్రాల్లో చల్లడం ద్వారా భూమికి జవసత్వాలను అందించేవారు. కాలక్రమేణా వెలుగు చూసిన నూతన సాగువిధానాలు పాత పద్ధతులన్నిటికీ మంగళం పాడగా.. ఈక్రమంలోనే సహజసిద్ధమైన ఎరువుల స్థానాన్ని రసాయనిక ఎరువులు ఆక్రమించేశాయి. ఈ తరహా ఎరువులను పరిమితికి మించి వాడటం వల్ల పంట ఉత్పత్తులన్నీ విషతుల్యంగా మారడమే కాక, పెట్టుబడి వ్యయం పెరిగింది. నేటి కాలంలో ఎక్కువ మంది ప్రజలు సేంద్రియ వ్యవసాయంతో పండించిన పంటలపై శ్రద్ధ కనబరుస్తున్నారని, కూరగాయలు, తదితర పంటలను కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు వేయకుండా మట్టి, నీరుతో పంటలు పండిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సేంద్రియ విధానంలో ప్రకృతి సంబంధ ఎరువులను వాడుతూ స్థానికంగా లభించే వనరులు, తక్కువ పెట్టుబడితో రసాయన ఎరువుల జోలికి పోకుండా సేంద్రియ విధానంలో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు.


కాళ్లకూరు గ్రామానికి చెందిన రైతు ముదుండి లక్ష్మీపతిరాజు తోటలో సేంద్రియ సాగుతో వివిధ పంటలను పండిస్తున్నారు. టమాట, ఆనబకాయలతో పాటు వివిధ రకాల ఆకుకూరలు సాగుచేస్తున్నారు. వ్యాపార ధృక్పథంతో కాకుండా పండించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను ఉచితంగా అందిస్తున్నారు.


వివిధ రకాల మామిడి : చిత్తూరు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి యాపిల్, కమల, బారామస్ మామిడి మొక్కలను తెచ్చి నాటారు. చిత్తూరు నుంచి వచ్చిన బారామస్ మామిడి 360 రోజులు కాయలు కాస్తున్నాయి. మామిడి రకంలో సాధారణ రకం ఏడాదికి ఒక్కసారే కాయలు కాస్తాయి. పునాసరకం సంవత్సరానికి రెండు సార్లు కాస్తున్నాయి. బారామస్ మామిడి మాత్రం 360 రోజులు కాస్తాయని తెలిపారు. గతంలో హైదరాబాద్ నుంచి ద్రాక్ష మొక్కలను కొనుగోలు చేసి పెరట్లో నాటి ద్రాక్ష పంటను పండించారు.

40 ఏళ్లుగా సేంద్రియ సాగు

ముదుండి లక్ష్మీపతి రాజు, రైతు కాళ్లకూరు

గత 40 ఏళ్లుగా సేంద్రియ సాగుతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల రకాల పంటలు పండిస్తున్నా. నాకున్న భూమిలో అన్నీ రకాల పంటలు వేసి పండిస్తున్నా. ఈవిధానంలో మిర్చి, టమాట, బీర, ఆనబకాయలు, అరటి కాయలు, పుదీనా, కొత్తిమీర, బచ్చలి, మెంతి, తదితర పంటలను పండిస్తున్నామన్నారు. సేంద్రియ సాగుతో చేసిన వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను పండించి గ్రామస్తులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. రైతులు సేంద్రియ విధానాలు పాటించి భూమిని, ప్రకృతిని కాపాడాలన్నారు.


అరటిచెట్లు పండిస్తున్న ముదుండి లక్ష్మీపతిరాజు


గంగయ్యను సత్కరిస్తున్న బంగారయ్య దంపతులు


గంగయ్య సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఉండి

రిటైర్డ్ జడ్జి, దాత పెరికల గంగయ్య సేవలు ఎనలేనివని బొబ్బిలి బంగారయ్య కొనియాడారు. ఆదివారం ఉండి మండలం చెరుకువాడ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పెరికల గంగయ్యను బొబ్బిలి బంగారయ్య దంపతులు సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పెరికల గంగయ్య సేవలు ఎనలేనివని, తన సొంత నిధులతో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించడమే కాకుండా దాని పోషణార్ధం తనకున్న ఏడెకరాల వ్యవసాయ భూమిని వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. గ్రామంలో కళ్యాణ మండపం అందుబాటులో లేకపోవడంతో కళ్యాణ మండపాన్ని నిర్మించి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. అటువంటి దాతను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పెరికల వేణుగోపాలరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా శ్రీను

ప్రజాశక్తి - నరసాపురం


ముదునూరి ప్రసాదరాజుతో శ్రీను

నరసాపురం నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను వైసిపి నియమించింది. నరసాపురం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన యర్రా శ్రీనును నియమించింది. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషిచేస్తానని తెలిపారు. యర్రా శ్రీనును వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పలువురు వైసిపి నాయకులు అభినందించారు.

చేనేత అభివృద్ధికి, కార్మికులకు అండగా ఉంటా

చేనేత విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు ముక్తేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు



చేనేత అభివృద్ధికి, కార్మికులకు అండగా ఉంటానని చేనేత విభాగం(వివర్స్) వైసిపి నరసాపురం నియోజకవర్గం అధ్యక్షుడు కరెళ్ల సూర్య ప్రకాష్ నాగ ముక్తేశ్వరరావు అన్నారు. జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నానని ఆదివారం ముక్తేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కార్మికులకు అండగా, వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు, వైసిపి నాయకులు ఆయనను అభినందించారు.

వైసిపి డాక్టర్ సెల్ నియోజకవర్గ అధ్యక్షునిగా ఆంజనేయులు

ప్రజాశక్తి - మొగల్తూరు



డాక్టర్ సెల్ నరసాపురం నియోజకవర్గం అధ్యక్షునిగా వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నానని ఆదివారం సిహెచ్ విపి.ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి, వైద్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, పార్టీ నాయకులు ఆయనను అభినందించారు.

ఎంఎస్‌ఎంఎ సర్వేకు వ్యాపారులు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పురపాలక సంఘంలో చేపట్టిన ఎంఎస్‌ఎంఎ సర్వేకు సంబంధించి వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య వ్యాపారులకు సూచించారు. ఈమేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పురపాలక సిబ్బంది సర్వేకు దుకాణాల వద్దకు వచ్చినప్పుడు యజమాని ఆధార్, పాన్ కార్డు, జిఎస్‌టి, బ్యాంకు ఖాతా నెంబర్లు అందించి సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు

ప్రజాశక్తి - తణుకు రూరల్


తణుకురూరల్ : మండల పశువైద్యాధికారి

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నాలుగు నెలల వయసు పైబడిన ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ కరణం శంకర్ భావనారాయణ తెలిపారు. 4 నుంచి 8 నెలల వయసు గల పెయ్యదూడలకు బ్రూసెలోసిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు ఆయన తెలిపారు. పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని పశువులన్నిటికీ టీకాలు వేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల షెడ్యూల్

ఈనెల 3, 4 తేదీల్లో ముద్దాపురం, వేల్పూరు గ్రామాల్లో, 5, 6 తేదీల్లో కోనాల, వేల్పూరు గ్రామాల్లో, 7,8, 10 తేదీల్లో దువ్వ, వేల్పూరు గ్రామాల్లో 11న దువ్వ, మహాలక్ష్మి చెరువు, 12న దువ్వ, యర్రాయి చెరువు, 13, 14 తేదీల్లో దువ్వ, కొమరవరం, 15, 17 తేదీల్లో తేతలిలో, 18, 19, 20వ తేదీల్లో మండపాక గ్రామంలో టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయనున్నమని పశు వైద్యాధికారిని డాక్టర్ గొట్టిముక్కల నీలిమ తెలిపారు. జాతీయ పశువ్యాధి నివారణ పథకంలో భాగంగా ఈనెల మూడో తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నామని, ఆయా శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని నీలిమ సూచించారు.


మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి


ఆచంట : మహిళలతో ఎస్ఐ వెంకటరమణ

ప్రజాశక్తి - ఆచంట

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆచంట పోలీస్ స్టేషన్ వద్ద మహిళలకు గోరింటాకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులకంటే అన్ని రంగాల్లోనూ ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : ప్రతి స్త్రీ ఒక శక్తి స్వరూపిణి అని, సృష్టికి ప్రతి సృష్టి మహిళ అని ప్రభుత్వ కెడిఎస్ పిడి లక్ష్మీకాంతం అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పిఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ప్రారంభించారు. లక్ష్మీకాంతం మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు, మహిళల కట్టు బొట్టు, నడవడికకు నిదర్శనమని అన్నారు. 40 ఏళ్లుగా మహిళా దినోత్సవ వేడుకలను వారోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అధ్యాపకురాలు జేడిగుంట సునీత, నాచు శ్రీవల్లి, మహిళ పోలీస్ హెడ్ ఎండి షేహానాజ్, ఎండి సరోజినీ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, బాల్యవివాహాలు అనర్థమని, మహిళలపై ఘటనలు బాధాకరమని, ఇటువంటి ఘటనలను ప్రతిఘటించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, రంగవల్లులు పోటీలు, మహిళ సాధికారతపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ, కలిగోట్ల గోపాలశర్మ, ఉపాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


భీమవరంటౌన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

కొండెక్కిన కొత్తిమీర

అమాంతంగా పెరిగిన ధర

ప్రజాశక్తి - పాలకొల్లు




కొత్తిమీరతో వంటకాలు ఇష్టంలేని వారు ఎవరూ ఉండరు. అందుకే దానికి అంత డిమాండ్. దీంతో కొత్తిమీర చట్నీ సంగతి ఎలా ఉన్నా.. కూరలను దించే ముందు గార్నిష్‌గా కొత్తిమీర వేస్తారు. అటువంటి కొత్తిమీర శీతాకాలంలో బాగా దొరుకుతుంది. ప్రస్తుతం శీతాకాలం ముగుస్తు ఎండలు పెరగడంతో ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందనంటోంది. ఇప్పటి వరకు కిలో రూ.20 ఉన్న కొత్తిమీర ఎండలు పెరగడంతో కిలో రూ.80కు పెరిగింది. గతంలో రూ.10కు పెద్ద కట్ట ఇచ్చేవారు. కానీ ఆదివారం మార్కెట్లో రూ.10కు కొన్ని రొబ్బలు మాత్రమే ఇచ్చారు. ఎండలు పెరిగే కొద్దీ ఇంకా ధర పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రజా ఆకాంక్షల బడ్జెట్

టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్ రూ.3,22,359 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా ఆకాంక్షలకు అనుకూలంగా ఉందని ఎపిఐఐసి ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌డియే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమ హామీల అమలుకు సమ ప్రాధాన్యతనిచ్చి, స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేయడం జరిగిందన్నారు. వైసిపి చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరిస్తూ అనేక సవాళ్లను, స్లంకిష్ట పరిస్థితుల సమస్యలను అధిగమించి పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను రూపొందించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల అంశాలకు అనుగుణంగా బిసి, ఎస్‌టి, ఎస్‌సి, మైనార్టీ, రైతులు, మహిళల కొనుగోలు శక్తి పెరిగేలా, ప్రాంతీయ అసమానతలను అధిగమించేలా, అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యమిచ్చే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉండడం ఆనందదాయకం అన్నారు. గత ప్రభుత్వ దుర్మార్గపు పన్నులను తొలగిస్తూ కొత్త పన్నులను విధించకుండా రాష్ట్ర రెవెన్యూ సమకూరేలా, మూలధన వ్యయానికి అధిక శాతం నిధులు కేటాయించారన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం మూలధన వ్యయం 59 శాతం ఖర్చు చేస్తే తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం 2019-24 మధ్య కేవలం 22 శాతం ఖర్చు చేసిందని, జగన్ పాలనలో మూలధన వ్యయం 60 శాతం తగ్గిందని తెలిపారు. ఎన్‌టిఆర్ భరోస కోసం రూ.27,518 కోట్లు, తల్లికి వందనం పథకం కోసం రూ.9407 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6300 కోట్లు, పోలవరానికి రూ.6705 కోట్లు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ కోసం రూ.3,377 కోట్లు, ఎస్‌సి, ఎస్‌టిల విద్యుత్ కోసం రూ.400 కోట్లు, రహదారుల నిర్మాణం కోసం రూ.4,220 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.13,600 కోట్లతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు, మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల అమలుకు నిధులు కేటాయించడంతో రాష్ట్ర ప్రజానీకం సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.


పాలకొల్లు రామలింగేశ్వర ఆలయంలో ఓంకార్

క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో యాంకర్ ఓంకార్

ప్రజాశక్తి - పాలకొల్లు

పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంను సినీ దర్శకుడు, యాంకర్ ఓంకార్ ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ శేష వస్త్రంతో సత్కరించారు. స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం ఆయనకు అందించారు.

భీమవరం టౌన్ : ప్రముఖ యాంకర్, నటులు ఓంకార్ శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లు పెట్టాలి

రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని

ప్రజాశక్తి - యలమంచిలి

ఈనెల 18, 19 తేదీలలో జరుగు పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లు పెట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ అన్నారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం మండల సమావేశం కట్టుపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాల రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్, రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ ఈనెల 18, 19 తేదీలలో జరుగు పార్లమెంటు సమావేశాలలో మహిళా బిల్లు పెట్టాలని, జనాభాలో సగం మంది ఉన్న మహిళలు రాజకీయంగా సగం మంది ఉండాలని సమావేశంలో బిల్లు చేయాలన్నారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు బోను దుర్గనరేష్ ఆదేశానుసారం సంఘంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, మహిళలే మహారాణులని, దేశవ్యాప్తంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా యలమంచిలి మండల కార్మిక విభాగ అధ్యక్షులుగా కర్రి యేసు రత్నం, మండల సోషల్ మీడియా కన్వీనర్ నక్క సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గుబ్బల వెకన్న బాబులను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. రానున్న రోజులలో చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఒబిసి రిజర్వేషన్లు అమలు చేయాలని, జనగణనలో కులగణన చేయాలని, బిసి రాజకీయ రిజర్వేషన్లు ఎ బి సి డి లుగా అమలు చేయాలని తీర్మానం చేశారు. చంద్రప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా బిసిలకు ఉన్న హక్కులను కాపాడాలని, బిసి కులాలకు అండగా ఉన్న వారికే మనం అండగా ఉండాలని అన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని పార్టీలు, అన్ని కులాలు, అన్ని మతాలకు చెందిన వారిని గుర్తించి పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. బిసి నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి గణేష్ భవాని గ్రామగ్రామాన కమిటీలను ఏర్పాటు చేస్తూ బిసిలను ఏకతాటిపై నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కురెళ్ల మాణిక్యాలరావు, కడలి రామకృష్ణ, భాస్కరరావు, పొన్నమండ శ్రీరాములు, కరుణ మాయుడు, బాలాజీ, గోవిందు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రధాన పంటకాలువ నుంచి ఉప్పుగుంట వెళ్లే కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు ఉండి పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వారు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పంటకాలువలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు శనివారం సాయంత్రం ఇరిగేషన్ సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ వారు స్పందించలేదని ఆదివారం ఉండి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం సమయంలో పోలీసులు మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించారన్నారు. మృతునికి సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు వయసు ఉంటుందని, మృతుని ఒంటిపై పసుపు రంగు టీ షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్, చేతి మీద గౌరి ఆదిలక్ష్మి అనే పేరుతో పచ్చబొట్టు ఉన్నాయని తెలిపారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే వెంటనే ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తెలిపారు.